

# రెండు జిల్లాల వారధి.. పట్టించుకునే వారేరి?

- ప్రమాదకరంగా మానేరు వంతెన
- నిర్వహణ లోపంతో పొంచి ఉన్న ప్రమాదం
- బ్రిడ్జిపైనే భారీ గుంతలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని పీవీ నగర్ సమీపంలో గల మానేరు నదిపై నిర్మించిన వంతెన నిర్వహణ లోపంతో ప్రమాదకరంగా తయారైంది. భూపాలపల్లి ,పెద్దపల్లి జిల్లాలకు అనుసంధానంగా ఉన్న మానేరు బ్రిడ్జి పై నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దాదాపు యాభై ఏళ్ళ క్రితం నిర్మించిన వంతెన నిర్వహణ లోపంతో ప్రమాదకరంగా మారింది. వంతెనపై చాన చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, ఇనుప చువ్వలు బైటికి తేలాయి. దీంతో పలువురు వాహన దారులు గుంతలు గమనించక ప్రమాదాల భారిన పడుతున్నారు. వంతెన నుంచి ఇనుప చువ్వలు బైటికి రావడంతో వాహనాలు చెడిపోతున్నాయి అని, ఇనుప చువ్వలు వాహన టైర్ లకు గుచ్చుకోవడంతో వాహనాలు పంచర్ అయ్యి అదుపు తప్పి నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి అని వాహన దారులు, మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి సోమన్ పల్లి గ్రామం వైపు వంతెన రైలింగ్ ని నెల రోజుల క్రితం లారీ ఢీ కొట్టడంతో రైలింగ్ సైతం కూలిపోయి వంతెన ప్రమాదకరంగా తయారైంది అని, అడవి సోమన్ పల్లి మూల మలుపు వద్ద వంతెన రైలింగ్ దెబ్బతినడంతో రాత్రి వేళ వాహనాలు అదుపు తప్పితే మానేరు నదిలో పడిపోయి పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది అని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రెండు జిల్లాలకు ప్రధాన వారధిగా ఉన్న మానేరు వంతెనపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు కూలి పోయిన రైలింగ్ స్థానంలో కొత్త రైలింగ్ ఏర్పాటు చేసి వాహన దారులు ప్రమాదాల భారిన పడకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.





## పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలతోపాటు కట్యాల జడ్పీపీఎస్ పాఠశాల, సంగెమ్ మండలంలోని కొత్తగూడెం, కాపుల కనపర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్ లో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయుల నియోజకవర్గ ఓటరు జాబితా తయారీ గురించి గుర్తింపు పొందిన రాష్ట్ర రాజకీయ పార్టీ ప్రతినిధులు, యూనియన్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదన కలెక్టర్ జి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అత్యంత ఖచ్చితత్వంతో పశు గణాంకాల నమోదు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు గణన వాల్‌పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేటి నుంచి నాలుగు నెలల పాటు 21వ జాతీయ పశు గణన ప్రక్రియ చేపట్టడం జరుగుతున్నదని, ఇందుకోసం జిల్లాలో 58 మంది పశుగణనకర్తలు, 24 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు.



# సొంతింటికోసం.. దరఖాస్తు చేసుకోండి

- ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు
- జర్నలిస్ట్ ఇంటి స్థలాల దరఖాస్తుల విడుదల

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ఆధ్వర్యంలో జర్నలిస్ట్ ఇంటి స్థలాల దరఖాస్తూ స్వీకరణ పత్రాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, కార్యదర్శి సామంతుల శ్యామ్ లతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా గాడిపల్లి మధు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరబోతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా జర్నలిస్టుల సంక్షేమం దిశగా అడుగులు వేయలేదన్నారు. మొట్టమొదటిసారిగా మీడియా అకాడమీ చైర్మన్ అయినటువంటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీ జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం దరఖాస్తు స్వీకరణ పత్రాన్ని విడుదల చేయడం చాలా సంతోషమని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్ట్ కు న్యాయం జరిగేలా యూనియన్లకు అతీతంగా ఇంటి స్థలాల కోసం అప్లికేషన్ నింపి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీష్ కుమార్, సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీకి పంపిచాల్సిందిగా తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి జర్నలిస్ట్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యామల శ్రీనివాస్, తెంజు అధ్యక్షులు సాంబయ్య, చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ తోపాటు సీనియర్ రిపోర్టర్ సర్వేశ్వరరావు, సనిగల లక్ష్మన్, మెండ మల్లేష్, బత్తుల మల్లయ్య, గోవు రామస్వామి, గజ్జల రాజయ్య, లక్ష్మణ్, దూలం రవి, సుధాకర్ తో పాటు జిల్లాలోని అన్ని మండలాల జర్నలిస్టులు, ఐజేయూ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# అహ్లాదంతోపాటు ఆరోగ్యం

- సిమ్ అండ్ సామ్స్, పార్టీ అండ్ ప్లే టౌన్ గేమింగ్ జోన్
- ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అన్ని వయసుల వారికి అహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని సముపార్జించిపెట్టే గేమింగ్ జోన్ లు నగరంలో కూడా ప్రారంభం కావడం శుభపరిణామమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నగరంలోని 32వ డివిజన్ ఉర్సుగుట్ట సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిమ్ అండ్ సామ్స్, పార్టీ అండ్ ప్లే టౌన్ గేమింగ్ జోన్ ను మేయర్ గుండు సుధారాణితో కలిసి మంత్రి సురేఖ శుక్రవారం రిబ్బన్ కట్ చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి గేమింగ్ జోన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గేమింగ్ జోన్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నేటి పోటీ యుగంలో శారీరక శ్రమకు ప్రాధాన్యం రోజు రోజుకీ పెరుగుతున్న తరుణంలో గేమింగ్ జోన్ ను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని అన్నారు. పిల్లలు సెల్ ఫోన్లకు అతుక్కుపోతున్న ఈ రోజుల్లో వారికి ఆటలు చాలా అవసరమని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆటల ద్వారా పిల్లల్లో గెలుపోటములను సమానంగా తీసుకునే పరిణతి కలుగుతుందని తెలిపారు. పిల్లలతో బాటు వచ్చే వారి తల్లిదండ్రులకు సమయం వృధా కాకుండా శారీరక వ్యాయమానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం వల్ల ఈ గేమింగ్ జోన్ కు ఆదరణ పెరుగుతుందన్నారు. గేమింగ్ జోన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కొండా సురేఖకు వేదపండితుల మంత్రోచ్చారణతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. గేమింగ్ జోన్ లోని ఆటల వివరాలను తెలుసుకుని, తాను ఆటలు ఆడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను మంత్రి గుర్తు తెచ్చుకున్నారు. ఆటల వివరాలు, డిస్కౌంట్ కార్డులు, ఫుడ్, అందిస్తున్న సౌకర్యాల పై నిర్వాహకులు మంత్రి కొండా సురేఖకు వివరించారు.





## సైకిల్ తొక్కిన మంత్రి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదినం సందర్భంగా శుక్రవారం మడిపెల్లి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఆంధ్ర బాలిక స్కూల్ కు చెందిన బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. తూర్పు నియోజక వర్గ పరిధిలోని క్యాంప్ ఆఫీస్ కి మంత్రి కొండా సురేఖ వచ్చినట్లు తెలుసుకున్న మడిపెల్లి కృష్ణ గౌడ్ విద్యార్థినులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి కొండా సురేఖ తను కూడా సైకిల్ తొక్కి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.